

# అసమర్థుడు

కృపశ్రీ

గోపాలంకి ఆలోచనలతో తలపోటు పెట్టసాగింది.

ఇప్పుడు ఆరు రూపాయిలు కావాలి! ఎలాగ సంపాదించడం?-ఎవ్వరి నడగడం?

ఇంట్లో ఆరేళ్ళ కొడుక్కి వారం రోజుల్నించి జ్వరం. డాక్టరొచ్చి మందిస్తున్నాడు. జ్వరం నిన్నటినుంచి నార్మలులో వుంది. కాని మనిషి చాలా నీరసంగా

వున్నాడు. ఆ నీరసం, అదీ తగ్గడానికి హార్లిక్సు ఇస్తూండమని చెప్పేరు డాక్టరు. హార్లిక్సు కొనాలంటే ఆరు రూపాయిలుండాలి. నిన్న డాక్టరు చెప్పింది మొదలు దాను అదికొనడానికి అవసరమైన డబ్బుకోసం ప్రయత్నిస్తున్నాడు. కాని ఎక్కడనూ లభ్యంకాలేదు. ఎవరిని అప్పడిగినా లేదంటున్నారు.

అది నిన్నను కొననందుకే భార్య ఎన్నోమాటలంది. పిల్లలంటే ప్రేమాభిమానాలు లేనివాడని, కఠిన హృదయుడని, ఏవ్వంతేనా బాధ్యతని పట్టించుకోనివాడని, అసమర్థుడనీ-జ్వరం పడి లేచి నీరసంతో వుంటున్న ఆరేళ్ళ కొడుక్కి డాక్టరు చెప్పిన హార్లిక్సు కొని ఇవ్వలేక పోయామన్న బాధతో ఇంకా ఎన్నో అంది.

కాని తనేం చేయగలడు?-చేతికొచ్చిన నూట యాభై రూపాయిలు జీతం బాకీలు తీర్చడానికి, ఏవో కొన్ని నిత్యావసర వస్తువులు కొనడానికి అయిపోయింది అందిన రోజునే. అర్ధ రూపాయి డబ్బులు కూడా దగ్గర మిగలలేదు. తను అడగవలసిన వాళ్ళనీ, అడగరాని వాళ్ళనీ అందరినీ అప్పు అడిగాడు. కాని ఎవ్వరూ ఇవ్వలేదు.

దగ్గర డబ్బు లేని వాళ్ళు కొందరు, ఉన్నా ఇవ్వని వాళ్ళు కొందరు అని తెలిసి కూడా అందరినీ అడిగి లేదనిపించుకున్నాడు.

ఇంక బజారులో దుకాణాల వాళ్ళు అసలే నమ్మరు. తను ఒకసారి నెల మధ్యంలో అవసరపడి అయిదు రూపాయిల కిరాణా సామాన్లు అరువుగా అడిగితే ముగ్గురు నలుగురు దుకాణాల వాళ్లు, 'మీ ఆఫీసు బాబులు సామాన్లు తీసికెళిపోవడమే కాని డబ్బివ్వరు; అరువులివ్వలేం బాబూ!' అన్నారు. ఎవరో కొందరలాగ చేస్తే అందరూ అలాగే చేస్తారని వాళ్ళ నమ్మకం! ఇంక మరి తనేం చేయగలడు?

ఈ ఆలోచనలవల్ల గోపాలం మనసు ఆఫీసు పనిలో నిమగ్నంకాలేదు. కొడుకు ఆరోగ్యం గురించిన ఆందోళన,ఆ కొడుక్కి హార్లిక్సు కొనలేక పోయానన్న ఆవేదన అతడిని పీడించసాగాయి.

గోపాలం ఆలోచిస్తూ కూర్చున్నాడు. చుట్టుపట్ల సీట్లలోవున్న తోటి ఉద్యోగులంతా ఎవరి పనిలో వారు నిమగ్నులై వున్నారు. కొందరు ఫైళ్ళు పట్టుకొని ఆఫీసరు వద్దకు, హెడ్ క్లార్క్ వద్దకు వెళుతూ వస్తూ వున్నారు. గోపాలం వారందరినంకా చూస్తూ అలాగే ఎడతెగని ఆలోచనలతో తల పట్టుకుని కూర్చున్నాడు.

ఇంతలో మధ్యాహ్నం టీ టైమయింది. అంతవరకు పనులలో మునిగివున్న వుద్యోగులందరూ ఆటవిడుపు అయినట్టుగా తమ సీట్లలోంచి లేచి రిఫ్రెష్మెంటుకోసం బయటకు దారితీశారు.

గోపాలం జేబు తడుముకున్నాడు. ఒక పావలా కాసు దొరికింది. తల ఆలోచనలతో బద్దలవుతున్నట్టయింది. కాస్త కాఫీ తాగాలని బుద్ధి పుట్టి సీటులోంచి లేచి బయటకు వెళ్ళాడు.

ఆఫీసుకి ఎదురుగా వున్న టీ దుకాణం దగ్గర తోటి ఉద్యోగులు కొందరు నిల్చొని టీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు ఆ ప్రక్కనున్న కిల్లీ దుకాణం వద్ద నిల్చొని కిల్లీలు, సిగరెట్లు తీసుకుంటు న్నారు. మరికొందరు ఆఫీసు గేటుముందు నిల్చొని లోకాభిరామాయణం చెప్పు కుంటున్నారు.


గోపాలంకి కాఫీయే కాని టీ అలవాటు లేదు. అందుకని అతను ఎదురుగా వున్న హోటల్లోకి వెళ్ళాడు. హోటలంతా జనంతో నిండివుంది. అక్కడ కూడా కొందరు కొలీగ్స్ టిఫిన్లు, కాఫీలు తీసుకుంటున్నారు.

గోపాలం ఖాళీ సీటుకోసం కలయ చూశాడు. ఒకమూలనున్న టేబిల్ దగ్గర ఒక సీటు ఖాళీగా అగుపించింది. గోపాలం ఒక కాఫీ తీసుకురమ్మని సర్వరుతో చెప్పి వెళ్ళి ఆ సీటులో తల వంచుకుని ఆలో చిస్తూ కూర్చున్నాడు.అయిదు నిముషాలలో సర్వరు కప్పుతో కాఫీ తెచ్చి టేబిల్‌మీద వుంచి, 'ఇదుగో సార్ కాఫీ!' అంటూ బిల్ రాసి సాసరు కిందపెట్టి వెళ్ళిపోయాడు. సర్వరు పిలుపుతో గోపాలం బిల్ తీసి పట్టు కుని కప్పు నోటి దగ్గరుంచుకొని కాఫీ సిప్ చేయసాగాడు. ఇంతలో గోపాలంకి 'నమ స్కారం బాబూ!' అన్న ఎదుటి సీటులోని మనిషి కంఠస్వరం వినిపించింది. గోపాలం సిప్ చేస్తూనే ఆ వ్యక్తివంక చూశాడు. అతను ఆఫీసు ఫ్యూన్ సన్యాసి. తన డిపార్టుమెంటుకే చెందిన, ఆ ప్రక్కనే వున్న మరొక ఆఫీసులో పనిచేస్తున్నాడు తనని చాగా ఎరుగును. అతడు టీ తాగు తున్నాడు. టిఫిన్ తిని ఖాళీ చేసిన మూడు ప్లేట్లు అతనివైపు, టేబిల్ మీదున్నాయి. గోపాలం ముభావంగానే 'నమస్కారం' అంటూ కాఫీ సిప్ చేయసాగాడు తాపీగా.

సన్యాసి టీ తాగేసి ముందుగానే లేచి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత మరో మూడు నిముషాలకి గోపాలం కాఫీ తాగడం ముగించి లేచి వెళ్ళి బిల్లు ఇరవై పైసలు చెల్లించి బయటకు వచ్చాడు. బయట హోటల్ గుమ్మంలో వున్న కిల్లీ బడ్డీ వద్ద నిల్చొని కిళ్ళీ వేసుకుని సిగరెట్టు ముట్టి స్తున్నాడు సన్యాసి.

గోపాలం ఆఫీసులోకి వెళ్ళిపోయి తన సీటులో కూర్చున్నాడు. అతడి మెదడులో సన్యాసి గురించిన ఆలోచనలు ముసురుకొన సాగాయి.

సన్యాసి ఆఫీసు ఫ్యూన్‌గా పనిచేస్తూ నెలకి డెబ్భయి రూపాయిల జీతం తెచ్చు కుంటున్నాడు. భార్యా, నలుగురు పిల్లలు వున్నారు. అతనా ఊరు ఏడాదికిందట బదిలీ అయివచ్చాడు. వచ్చిన రెండుమూడుమాసాల నాడే చాలా జబ్బు పడి మూడు మాసాలు మంచం ఎక్కాడు. ఆ మూడు మాసాలు అతనికి జీతం అందలేదు. అతను జబ్బు పడి లేచిన తర్వాతే అతడి భార్యా, రెండవ పిల్లా జబ్బు పడ్డారు. వారిద్దరి జబ్బు మరో మూడు మాసాలు తీసుకుంది. ఆ ఆరు మాసాలు సన్యాసికి ఎన్నో ఒడుదుడుకులు




ఏర్పడ్డాయి. అయితే ఆ ఆరు మాసాలూ అతడు వీళ్ళనీ వాళ్ళనీ అడుక్కుంటూ వారి సహాయంవల్లనే ఆ ఒడుదుడుకుల నన్నిటిని దాటుకొని వచ్చాడు. తను మంచం ఎక్కిన మూడు మాసాలూ భార్యని, పిల్లల్ని ఆఫీసు బాబు లందరి ఇళ్ళకు పంపేవాడు. వాళ్లు అందరి ఇళ్ళకు వెళ్ళి అతడు జబ్బుతో ఉన్నాడని, జీతం పూర్తిగా కోసేశారని, డబ్బులేదని, తిండిలేక మాడిపోతున్నామని మొరపెట్టుకునేవారు. వాళ్ళ మొర విని అంతా తమ తమ శక్తిని బట్టి బియ్యం, అన్నం, కూరలు, పచ్చళ్ళు, పావలా, బేడా డబ్బులు ఇచ్చేవారు. ఆ తర్వాత అతడి భార్య, రెండవ పిల్ల జబ్బు పడ్డప్పుడు అతడే అందరి వద్దకు వెళ్ళి మందులకి మాకులకి అని చెప్పి ధన సహాయం అర్థించాడు. అందరూ రూపాయి అర్ధా యిచ్చి సహాయపడ్డారు. అది చాలక అందరి ఇళ్ళకి వెళ్ళి తన బాధలు చెప్పుకుని అన్నం, కూరలు, పచ్చళ్లు ఊరగాయ అడిగి పట్టుకెళ్ళేవాడు సన్యాసి. అతను జబ్బు పడ్డప్పుడు అతని భార్యా, పిల్లలూ జబ్బు పడ్డప్పుడు గోపాలం కూడా ఎన్నో సార్లు పావలా బేడా యిచ్చి, పచ్చిడీపాకం యిచ్చి సహాయం చేశాడు. ఇప్పుడు కూడా అప్పుడప్పుడు టీకని, బీడీలకని స్టాఫ్ని డబ్బు అడుగుతూ వుంటాడు సన్యాసి.

గోపాలం ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఇంతలో ప్యూన్ వచ్చి 'అయ్యగారు పిలుస్తున్నారు' అని చెప్పాడు. గోపాలం ఆలోచనల్ని కట్టిపెట్టి ఆఫీసరు వద్దకు వెళ్ళాడు. ఆఫీసరు హెడ్డాఫీసునుంచి వచ్చిన ఒక లెటరు చూపించి దానికి జవాబు ఏమిటి రాయాలో ఒక రామాయణమంత చెప్పి ఆ ప్రకారంగా లెటరు రాసి తీసుకురమ్మన్నాడు. గోపాలం సీటులోకొచ్చి ఆఫీసరు చెప్పిన

ప్రకారం లెటరు రాయడానికి కూర్చున్నాడు. కాని కలం నడవడంలేదు. పిల్లవాడి హార్లిక్స్‌కి ఆరు రూపాయిలు ఎవరినడగడం, ఎలాగ సంపాదించడం అన్న ఆలోచనే అతని మెదడును వేధించ సాగింది. అయినా లెటరు రాసి తీసుకెళ్ళకపోతే ఆఫీసరు అగ్గవుతాడన్న భయంతో తప్పులు తప్పులుగా రాస్తూ కొట్టేస్తూ లెటరు రాయసాగాడు.

ఇంతలో 'మీకు మనియార్డరు వొచ్చింది సార్' అన్నమాట వినిపించింది. గోపాలం ఉలిక్కిపడి చూశాడు. కాని ఆ మనియార్డరు తనకికాదు; పక్కసీటులో వున్న చలపతికి! పోస్టుమాన్ చలపతికి మనియార్డరు ఫారం సంతకం చేయించడానికిచ్చి సంచీ లోంచి నోట్లు తీసి లెక్క పెడుతున్నాడు.

మనియార్డరు తనకి రాకపోయినా చలపతికి రావడం కూడా గోపాలంకి బ్రహ్మానందమే కలిగించింది.ఏదో పెద్ద మొత్తమే వచ్చినట్టుంది. ఆరు రూపాయిలు అప్పు అడిగితే యివ్వకపోడు చలపతి.


"ఏమిటోయ్, ధనలక్ష్మి వరించొచ్చినట్టుంది. ఎక్కడనించి ఏమిటి?" అంటూ కొంచెం హాస్యం మిళితంచేసి పలకరింపుగా అడిగినట్టు అడిగాడు గోపాలం.

చలపతి అవోలాగ ఆనందంతో కూసిన ఒక చిరునవ్వు నవ్వి ప్రశ్నగాను, సమాధానంగాను 'ఊఁ?—ఊఁ!' అని "ఏమిటీ?"—"అవును!" అన్న అర్థం వచ్చేటట్లు దీర్ఘంతీస్తూ, పోస్టుమాన్ ఇచ్చిన నోట్లు లెఖపెట్టి, మడిచి, జేబులో పెట్టుకొని, తిరిగి తన పనిలో నిమగ్నుడై పోయాడు.

గోపాలం ఆలోచనలన్నీ చలపతి కొచ్చిన డబ్బు చుట్టూనే ప్రదక్షిణం చేయ సాగాయి—ఎక్కడినుంచి వచ్చిందో ఆ మనియార్డరు! వాళ్ళ తమ్ముడికి హైదరాబాద్ లోని ఒక ఫర్మ్‌లో నెలకి నాలుగువందల రూపాయిల జీతంతో ఉద్యోగం అయిందని విన్నాడు. ఈ మనియార్డరు అతనే పంపేడు కామోసు!—తనకో ఆరు రూపాయిలు అప్పు యిస్తే బాగుణ్ణు!-కొడుక్కి హార్లిక్సు కొనుక్కుందును! —అడిగితేనో?—అంత డబ్బొచ్చింది కదా ఒక్క ఆరు రూపాయిలు అప్పు అడిగితే యివ్వడా?

గోపాలం ఆలోచనలతో సతమతం కాసాగాడు. చలపతికి డబ్బు రావడం చూసిన దగ్గరనుంచి అతడిని ఓ ఆరు రూపాయిలు అప్పు అడిగి కొడుక్కి హార్లిక్స్‌కొని తీసుకెళ్ళాలన్న ఆరాటం గోపాలంకి అధికం కాసాగింది. అతడా ఆరాటాన్ని అదుపులో పెట్టుకోలేక పోయాడు. డబ్బు రావడంతోనే అప్పు అడిగితే ఏమనుకుంటాడో అని సందేహిస్తూనే, "చలపతీ, ఒక సిక్స్ రుపీస్ అప్పివ్వగలవా?—నాకు జీతాలందగానే తిరిగి ఇచ్చేస్తాను; ఇంటిదగ్గర మావాడికి వారం రోజుల్నించి జ్వరం వస్తోంది; హార్లిక్స్ కొనాలి!" అని అడిగాడు.

"సారీ బ్రదర్, నే నిప్పుడు చాలా ఖర్చుల్లో వున్నాను. అందుకనే మా తమ్ము




దీకి ఉత్తరం రాసి నూటయాభై రూపాయిలు తెప్పించుకున్నాను. ఏమీ స్పేర్ చేయడానికి అవకాశం లేదు." అన్నాడు చలపతి.

చలపతి అలాగనడంతో గోపాలంఎంతో క్రుంగిపోయాడు. అడిగి లేదనిపించుకున్నందుకు బాధపడసాగాడు. కొడుకు జ్వరంతో వుండగా హార్లిక్స్ కొని ఇవ్వలేక పోయానన్న బాధకితోడు ఎక్కడా అప్పు దొరకలేదన్న బాధ, అందరినీ అడిగి లేదనిపించుకున్నానన్న బాధకూడా ఇప్పుడు గోపాలాన్ని పీడించసాగాయి. ఈ బాధవల్ల మనస్సు పనిలో లగ్నంకాక అలాగే పెన్ను పట్టుకుని ఊరికే కూర్చున్నాడు.

ఇంతలో ప్యూన్ వచ్చి ఆ లెటరు వేగంగా రాసి తెమ్మని ఆఫీసరు అంటున్నాడని చెప్పాడు. గోపాలం పదినిముషాలలో పట్టుకొస్తున్నానని ప్యూన్‌తో చెప్పి, ఆలోచనల్ని అదుపులో వుంచి, మనస్సుని స్వాధీనపరచుకొని ఎలాగో ఆ లెటరు ఇరవై నిముషాలకి పూర్తిచేసి, ఆఫీసరు వద్దకు పట్టుకొని బయల్దేరాడు.

గోపాలం ఆఫీసరు గది వద్దకు వెళ్ళేసరికి లోపల్నించి ఆఫీసరు మాటలు వినిపించసాగాయి. గోపాలం ద్వారం దగ్గరే ఆగిపోయాడు. ఓరవాకిలిగా వున్న స్ప్రింగ్ డోర్స్ సందులోంచి—కాళ్ళు నిటారుగా టేబిల్ క్రిందకి చాచి, కుర్చీలో వెనక్కి చేరబడి కూర్చున్న ఆఫీసరు, అతని ఎదుట టేబిల్‌వద్ద మౌనంగా నిల్చొని చలపతి అగుపించారు గోపాలంకి. "ఏమిటంతలా ఆలోచిస్తున్నావ్? అర్జంటుగా అవసరమయిందని కాని లేకపోతే నిన్నడిగే వాడిని కాను. ఓ ట్వెంటీఫైవ్ రుపీస్ చాలు! నీకు మళ్ళీ పేమెంట్స్‌లో యిచ్చేస్తాను!" అంటున్నాడు ఆఫీసరు.

"అలాగే సార్!" అన్నాడు చలపతి.

మరు నిముషమే జేబులోంచి పాతిక రూపాయిల నోట్లు తీసి టేబిల్‌మీద వుంచాడు.

ఆఫీసరు డబ్బు తీసికొని, "యూ కెన్ గో!"-ఐ విల్ రిటర్న్ దిస్ మనీ ఆన్ పే మెంట్స్!" అన్నాడు.

"యస్ సార్!" అంటూ చలపతి గది లోంచి బయట కొచ్చేశాడు. అతడి ముఖంలో ఎక్కడా ఆనందం లేదు సరికదా డబ్బు పోయిన వాడి ముఖంలాగ కళా విహీనంగా వుంది.

చలపతి బయట కొచ్చేశాక గోపాలం లోపలికి వెళ్ళి, రాసిన ఉత్తరం ఆఫీసరుకి చదివి వినిపించి, ఆఫీసరు ఆజ్ఞ ప్రకారం టైపు చేయడానికిచ్చేసి, తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు.

"తిరిగి ఇచ్చేదీ చచ్చేదీ లేదు కాని అప్పని అడిగి పాతిక రూపాయలు లాక్కున్నాడు. రమణమూర్తి దగ్గర ఆరు మాసాల కిందట పది రూపాయిలు తీసుకొని యిప్పటికీ యివ్వలేదట. ఇదిమాత్రం యిస్తాడేమిటి? కాణీకాదు అర్ధణాకాదు;పాతికరూపాయిలు" అని గొణుక్కుంటూ ధుమధుమ లాడు తున్నాడు చలపతి.

మరో అరగంట తర్వాత ఏదో పని వుండి ఆఫీసర్ని కలుసుకోడానికి అతడి రూంకి వెళ్ళాడు గోపాలం. "అయ్యగారు ఇంటికెళ్ళిపోయారండి! ఇయ్యాల ఆరంటా సినిమా కెళ్తారంట. అంచేత జేగె ఎల్లి పోయారు!" అని చెప్పాడు ప్యూన్. గోపాలం వెనక్కి వచ్చేశాడు. చలపతి ఫైల్సన్నీ షెల్ఫ్‌లో పెట్టేసి, ఇన్‌ఛార్జితో చెప్పి యింటికి వెళ్ళిపోతున్నాడు.

గోపాలం సీటులో కూర్చున్నాడు. అతడి మనస్సులో—భార్యకీ, పిల్లలకీ జబ్బుగా వుందని అందరినీ డబ్బులు తిండి వస్తువులు యాచించుకున్న ఆఫీసు ప్యూన్ సన్యాసి,—"ఏదీ, ఓ ట్వంటీఫైవ్ రుపీస్ స్పేర్ చెయ్!-నీకు పేమెంట్సప్పు డిచ్చేస్తాను!" అని అధికారంతో లాక్కున్న ఆఫీసరు మెదిలారు.

ప్యూన్ సన్యాసి హోటల్లో ముప్పావలా టిఫిన్, టీ తీసుకొని బడ్డీ దగ్గర నిల్చొని కిళ్ళీ వేసుకొని సిగరెట్టుముట్టించి విలాసంగా పొగ వదులుతున్నాడు.

ఆఫీసరు సూటు నెక్‌టై వేసుకొని— షిఫాన్ చీర, శాటిన్ బ్లౌజు, రిస్టువాచీ ధరించి కాళ్ళకి ముఖమల్ స్లిప్పర్ తొడుగు కొని నవనాగరికంగా అలంకరించుకున్న అందమైన భార్య ప్రక్కన కూర్చొని, దబ్బపళ్ళలాటి ఇద్దరు పిల్లల్ని తమ కిరు వైపులా కూర్చో పెట్టుకుని కులాసాగా సినిమా చూస్తున్నాడు.

గోపాలంకి వెంటనే ఇంటివద్ద జ్వరం పడివున్న కొడుకు, వానికి కొనవలసిన హార్లిక్స్, దాని గురించి భార్య అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"అవును, నేను నిజంగా అసమర్థుడినే లక్ష్మీ!-నేను ప్యూన్‌ని కాని ఆఫీసర్ని కాని అవలేదు. అందువల్లనే వాళ్ళిద్దరిలో ఏ ఒక్కడిలాగా చేయలేని అసమర్థుడి నయాను" అని మనస్సులోనే గొణుక్కున్నాడు గోపాలం.

——————